క్లుప్తంగా

9న గిరి భక్తులకు ప్రసాదం పంపిణీ

మహారాణిపేట: డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి సింహాచల గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ప్రసాద వితరణ జరగనుంది. 15 సంవత్సరాలుగా చేస్తున్న సేవను ఈ సంవత్సరం కూడా చేయటానికి పలు ఏర్పాట్లు చేస్తున్నామని కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం నాయకులు సింగూరు నరసింగరావు, భూపతి సత్యనారాయణ, పట్నాల నాగ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడ్లీ, టమాటా బాత్, కొబ్బరి చట్నీ, బొంబాయి చెట్నీతో పాటు బెల్లం, మిరియాల పాలు, అరటి పండ్లు, ఔషధ సేవలుగా పెయిన్‌బామ్ ఇవ్వనున్నట్లు ఫోరం సభ్యులు గుండు వెంకటేష్, కట్టా రమేష్, కేతా సత్యనారాయణ తెలిపారు. మానవ సేవే మాధవ సేవగా భావించి స్వామివారి అనుగ్రహంతో 9వ తేదీన అయ్యప్పనగర్, మురళీనగర్ వద్ద సేవలందించనున్నట్లు ఫోరం సభ్యుడు బిర్లా రెడ్డి తెలిపారు.

పదవీ విరమణ ఉద్యోగికి సత్కారం



పదవీ విరమణ చేసిన పార్వతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన పి. పార్వతిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, పార్వతి దంపతులను అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, పార్వతి తన ఉద్యోగ జీవితంలో కళాశాలకు అందించిన సేవలను కొనియాడారు.

పుష్పయాగానికి పువ్వుల తరలింపు



వివిధ రకాల పుష్పాలతో భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీ గోవిందరాజ స్వామివారి పుష్పయాగానికి అవసరమైన పుష్పాలను విశాఖ నుంచి తిరుమలకు తరలించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పూలను సేకరించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద ఈ పుష్పాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. అనంతరం మహిళా భక్తులు ఈ పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాక్ చేశారు. సంకల్పం చెప్పుకొని, శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం ఈ పూలను తిరుమలకు పంపించారు. ఆధ్యాత్మికవేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పుష్పాలలో 3,000 కలువలు, 2,000 తామరలతో పాటు వివిధ రకాల పూలు ఉన్నాయి.

గురుకులంలో వైద్య శిబిరం

ఆరిలోవ: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, మంగళవారం జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శ్రీకృష్ణాపురంలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, జ్వరాలను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్వరాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి మహిత విద్యార్థులకు జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో మలేరియా జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

బీచ్‌రోడ్డు: రేసపువానిపాలెంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక మహిళ, ఒక విటుడు, వ్యభిచార నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేసపువానిపాలెంలో నివాసం ఉంటున్న గిరిజ నాగలక్ష్మి, బోస రామకృష్ణ ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి, వ్యభిచార నిర్వాహకులైన గిరిజ నాగలక్ష్మి, బోస రామకృష్ణతో పాటు విటుడు గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒక యువతిని రక్షించారు. పోలీసులు కేసు నమోదు చేసి, పట్టుబడిన వారిని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

అక్రమ పార్కింగ్‌తో... అవస్థలు





ఒక పక్క భారీ వాహనాల పార్కింగ్‌తో ఇరుగ్గా మారిన జ్ఞానాపురం రహదారిలో వాహనాల ప్రయాణం



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని బీఆర్‌టీఎస్ రహదారిలో ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలు

- రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచే భారీ వాహనాలతో ఇబ్బందులు
- రోడ్లు ఇరుగ్గా మారి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం
- ఇష్టానుసారంగా నిలిపేస్తున్న వాహనాల వల్ల నిల్వ ఉండిపోతున్న చెత్తా చెదారం



తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో నిలిపిన భారీ వాహనం

కంచరపాలెం: కంచరపాలెం ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ప్రైవేట్ వాహనాల అక్రమ పార్కింగ్‌తో వాహన చోదకులు, స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహన చోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురం వెళ్లే రహదారుల్లో ఇష్టానుసారం వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేస్తున్నారు. నెలల తరబడి రోడ్లపై వాహనాలు నిలపడంతో చెత్తా చెదరాలు, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. దీంతో శానిటరీ సిబ్బంది వాటిని అలాగే వదిలేస్తున్నారు. ఇరుకు రోడ్లపై వాహనాలు నిలిపేస్తున్న కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డు లేకుండా పోతోంది. ఈ విధంగా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీస్ విభాగం ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం నరకం..

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా నగరానికి వెళ్లాలంటేనే భయంగా ఉంటుంది. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలపడంతో వాహనాల రాకపోకలకు లేశమాత్రం అనువుగా ఉండడంలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, వాహన చోదకుడు, కంచరపాలెం

ఏళ్ల తరబడి ఉన్న వాహనాలను తరలించాలి..

రహదారికి ఇరువైపుల ఏళ్ల తరబడి నిలిపిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వారికి ఇబ్బందులు ఉండవు. రోడ్లు ఊడ్చేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై వాహనాలను తరలించాలి.

– పి.కార్తీక్‌కుమార్, స్థానికుడు ఐటీఐ జంక్షన్

ప్రమాదాలు జరగక ముందే మేల్కోవాలి..

జోన్-5 పరిధిలో రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాల పార్కింగ్, మరమ్మతులు చేపడుతున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన స్పందన లేదు. ప్రమాదాలు జరిగాక హడావిడి చేయడం కాకుండా ముందే మేల్కొంటే మంచిది.

– ఎ.మల్లికార్జునరావు, ఊర్వశి కూడలి

వీరింతే..మారరంతే..!



వర్మా కాంప్లెక్సు 4వ రోడ్డు పక్కన వదిలేసిన చెట్ల కొమ్మలు

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో జరుగుతున్న చెట్ల కొమ్మల తొలగింపు విషయంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చెట్ల కొమ్మలను తొలగించడం మంచిదే అయినప్పటికీ, తొలగించిన కొమ్మలను రోడ్డు పక్కనే వదిలేయడంపై ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన చెట్ల కొమ్మలను వేరే చోటుకు తరలించడం తమ పని కాదన్నట్లు విద్యుత్ శాఖ వ్యవహరిస్తోందని, ఇది తరచుగా జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల మురళీనగర్‌లోని వర్మా కాంప్లెక్స్ నుంచి నాలుగో రహదారి సమీపంలో తొలగించిన చెట్ల కొమ్మలను పది రోజులుగా అక్కడే వదిలేశారు. దీనివల్ల వర్షాల్లో ఆకులు కుళ్లిపోయి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఈ కొమ్మలను తరలించడం తమ పని కాదని జీవీఎంసీ సిబ్బంది కూడా చెబుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. 'ఈ కరెంటోళ్లు ఎప్పుడూ ఇంతే' అంటూ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొమ్మల తరలింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువ కవులకు ఆదర్శం చోడగిరి



మాట్లాడుతున్న డాక్టర్ బండి సత్యనారాయణ

సీతంపేట: సమతా సాహితి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రముఖ శతకకర్త చోడగిరి చంద్రరావు సాహిత్యంపై పరిచయ సభ జరిగింది. డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సభకు ఎస్.ఆర్.వేమన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చోడగిరి అంబేడ్కర్ వాద కవిత్వం రాశారన్నారు. ఆయన గొప్ప నిబద్ధత గల మహాకవి అని, యువ కవులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధాన వక్త నేలపూడి బాపిరాజు మాట్లాడుతూ చోడగిరి రాసిన భీమశతకం, హృదయ వీణ శతకాలను సభకు పరిచయం చేశారు. చంద్రరావు కవి మాత్రమే కాదని, ఆయన ఒక వైతాళికుడని, ఆయన రాసిన పద్యాలు పండిత, పామరులను మెప్పించాయన్నా రు. అంతకు ముందు చోడగిరి జీవిత విశేషాలను డాక్టర్ బండి సత్యనారాయణ సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కవులు సీయార్కే, సామాజిక ఉద్యమ నేతలు వి.వి.దుర్గారావు, బీర రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాతలు..గ్రామీణ వైద్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ వైద్యులు ఎంతో ఉన్నతమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘాన్ని ఆయన అభినందించారు. డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులు అభినందనీయులని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు జంగం జోషి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమ్య, రమేష్, స్వర్ణలత, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు, న్యాయ సలహాదారు కేపీ దేశాయ్, సలహాదారు కోన ప్రకాష్, డాక్టర్ నరేంద్ర, గణేష్, లోక నాయక్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ విద్యార్థినులకు కోలాటంలో శిక్షణ



కోలాటం స్టిక్స్ అందజేస్తున్న ఇన్నర్ వీల్ ప్రతినిధులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని ఎన్జీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థినులకు కోలాటం శిక్షణలో భాగంగా, ఇన్నర్ వీల్ క్లబ్ నిర్వాహకులు మంగళవారం కోలాటం స్టిక్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధా కుమారి ఇన్నర్ వీల్ ప్రతినిధులను అభినందించారు. కోలాటం శిక్షణలో పాల్గొని, భారతీయ సాంప్రదాయ కళల్లో ఒకటైన కోలాటంలో ప్రతిభ చాటాలని ఆమె విద్యార్థినులను ప్రోత్సహించారు. కోలాటం వల్ల శారీరక, మానసిక వ్యాయామం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ ప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతరం సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్

మద్దిలపాలెం: ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రభావవంతంగా పని చేస్తున్నాయని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. నరసింహారావు అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతికతలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

నేటి తరం సాంకేతిక యుగంలో ప్రయాణిస్తోందని గుర్తించాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నూతన జ్ఞానాన్ని అందించి, జ్ఞానాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటిగా నిలుస్తోందని ప్రశంసించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతామాణిక్యం మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు కూడా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలలో అవకాశం కల్పించాలని కోరారు. అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో యువతకు ఉపయుక్తంగా నిలిచే కార్యక్రమాల నిర్వహణను ఆమె ప్రశంసించారు.

అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీవెన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నూతన నైపుణ్యాలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు స్వశక్తితో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రెండు వారాల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వెబ్ డిజైనింగ్ చేయగల సామర్థ్యాన్ని పొందారని, మొత్తం 56 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు.

డివిజన్ సిబ్బందికి డీఆర్‌ఎం అభినందనలు



డివిజన్ పరిధిలో విశేష సేవలందించిన సిబ్బందిని సత్కరించిన డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో విశేష సేవలందించిన సిబ్బందిని మంగళవారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం సమావేశ మందిరంలో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఘనంగా సత్కరించారు. కొత్తవలస-కిరండూల్, కోరాపుట్-రాయగడ సెక్షన్లలో గత సంవత్సర కాలంగా చేపట్టిన కొత్త లైన్ పనులలో భాగంగా, ఈ సిబ్బంది తమ అకుంఠిత దీక్షతో పనులను సకాలంలో పూర్తి చేశారని డీఆర్‌ఎం కొనియాడారు. డబ్లింగ్ పనులలో భాగంగా ఈ సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ ఏర్పాటు, మార్షలింగ్ యార్డ్స్, నాన్ ఇంటర్‌లాకింగ్ పనులను పూర్తి చేయడంలో డివిజనల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ మాస్టర్లు, టోకెన్ పోర్టర్లు, ఇతర సిబ్బంది కీలక పాత్ర పోషించారని డీఆర్‌ఎం తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో చేపట్టబోయే మరిన్ని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయాలని డీఆర్‌ఎం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

9న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

గోపాలపట్నం: కార్మిక, ఉద్యోగులు, కర్షకుల సమస్యలపై ఈ నెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ కోరారు. గోపాలపట్నంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం గోపాలపట్నం జోన్ సీఐటీయూ 11వ మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే విధంగా చట్టాలు తెస్తోందని విమర్శించారు. సంపదంతా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. అందులో భాగంగానే 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా తీసుకు వచ్చి కార్మికులకు నష్టం కలిగించే చర్యలు చేపడుతుందని వివరించారు. ఇవి అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు వంటి ప్రాథమిక హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతం రూ.26 వేలు చెల్లించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన 4000 మంది కాంట్రాక్ట్ కార్మికుల వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

సీతంపేట: సమాజానికి వైద్యులు అందించే సేవలు వెలకట్టలేనివని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్. సన్యాసి నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మంగళవారం గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన వైద్యుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.సి. రాయ్ జన్మదినాన్ని మనం 'డాక్టర్స్ డే' గా జరుపుకుంటున్నామని తెలిపారు. బీసీ రాయ్ పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా సేవలందించినప్పటికీ, ఆ సమయంలో కూడా తన వైద్య వృత్తిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ రోగులకు వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ప్రసంగిస్తూ రోగికి వైద్య సేవల పట్ల అవగాహన కల్పించి, ప్రేమ, అభిమానాలతో వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ అధ్యక్షుడు రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో డాక్టర్లు సంధ్యాదేవి, ఐ.వాణి, ఉషా ప్రసాద్, వేప మీనాక్షిలను సత్కరించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యశాల ప్రొఫెసర్ జ్యోతిర్మయి, ఆర్‌ఎంవో నవీన్, శ్రీలక్ష్మి, డాక్టర్ ఏవీ రమణ, వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ మేనేజర్‌గా వరప్రసాద్



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న వావ్ ప్రతినిధులు

మురళీనగర్: శ్రీలంకలోని దియాగామాలోని మహీంద్ర రాజపక్షే స్టేడియంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న 38వ శ్రీలంక ఇంటర్నేషనల్ మాస్టర్స్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2025కు ఇండియా టీమ్ మేనేజర్‌గా ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ మంగ వరప్రసాద్ ఎంపికైనట్లు విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వీఏఏవీ) తెలిపింది. ఈమేరకు మురళీనగర్ సెక్టార్-8లోని వావ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయనను అసోసియేషన్ తరుపున అభినందించారు. ఈ పోటీల్లో భారతదేశం నుంచి 210 మంది అథ్లెటిక్స్ పాల్గొంటారు. ఆయనతో పాటు వావ్ కోశాధికారి ఎం.రామారావు గురువారం శ్రీలంక బయలుదేరి వెళ్తారు. కార్యక్రమంలో జనకులం ఫౌండేషన్ ధర్మకర్త, వావ్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్ పర్సన్, వావ్ పీఆర్‌వో వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ పాల్గొని వారికి స్పోర్ట్స్ కిట్స్, డ్రస్‌లు అందించారు.

భాషా సాహిత్యాల సవ్యసాచి ఆచార్య తూమాటి దోణప్ప



దోణప్ప చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆచార్య జిల్లా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆచార్య తూమాటి దోణప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ తూమాటి దోణప్ప గొప్ప పరిశోధకుడని, ఆయన జీవితం పరిశోధకులకు ఆదర్శమని కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం మన భాషకు ఇచ్చే గౌరవమని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రె అప్పారావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. దోణప్ప ప్రియ శిష్యుడు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఈ సభకు రావడం సభకు నిండుదనం తెచ్చిందని పేర్కొన్నారు. దోణప్ప తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేశారని, తెలుగు వ్యుత్పత్తి పదకోశంలోనూ పనిచేశారని గుర్తు చేశారు. విశిష్ట అతిథి ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆత్మీయ అతిథి ఆచార్య గజ్జ యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్నలు కూడా దోణప్ప పరిశోధనల గొప్పతనాన్ని, రచనల ప్రాముఖ్యతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీవీకే కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డి.వి. సూర్య, తెలుగు విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.